షరతులు లేకుండా రుణమాఫీ అందజేయాలి

మోస్రా (చందూర్), ఆగస్టు 27 : ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ అందజేయాలని మోస్రా తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు.

ప్రతి మంగళ , శుక్రవారం డ్రైడే పాటించాలి

కంఠేశ్వర్, ఆగస్టు 27 : ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే పాటించాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ సూచించారు. నగరంలోని 19వ డివిజన్‌లో మంగళవారం పర్యటించి, డెంగీ బారిన పడి కోలుకున్న వారి ఇండ్ల పరిసరాలను పరిశీలించారు. డంపింగ్ యార్డును సందర్శించి రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు జ్వరసర్వే చేపట్టారు.

పీజీ పరిధిలో పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, ఆగస్టు 27 : టీయూ పరిధిలో పీజీ రెండో సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించి 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, బీఎల్ఐఎస్సీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. టీయూ మెయిన్ క్యాంపస్, తెలంగాణ వర్సిటీ సౌత్ కళాశాల -కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల-బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. టీయూ మెయిన్ క్యాంపస్‌లో పరీక్షలను రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఆరతి పరిశీలించారు. పరీక్షలకు 1808 మంది విద్యార్థులకు 1687 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆడిటోరియం డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు అనన్య

అనన్య, వర్ధనికి మెమోంటోలను అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్

ధర్పల్లి, ఆగస్టు 27 : త్రిదండి చిన్నజీయర్ స్వామిజీకి చెందిన ప్రజ్ఞావికాస్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలకేంద్రానికి చెందిన లిటిల్‌హార్ట్స్ పాఠశాల విద్యార్థిని దాసరి అనన్య ప్రథమ బహుమతి, వర్ధిని కన్సోలేషన్ బహుమతి అందుకున్నది. సదరు విద్యార్థులకు పాఠశాలలో ప్రిన్సిపాల్ బీఏ శ్రీకాంత్, హెచ్ఎం సాధన మంగళవారం సన్మానించారు. అనన్య సెప్టెంబర్ 2న ముచ్చింతల్‌లోని చిన్నజీయర్ స్వామీజీ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహం, అవార్డును అందుకోవడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

'ప్రతిభ' విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

సిరికొండ, ఆగస్టు 27 : మండలంలోని ప్రతిభ పాఠశాల 8,9,10వ తరగతి విద్యార్థులు స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్దకు క్షేత్రస్థాయి పర్యటనకు మంగళశారం వెళ్లారు. విద్యార్థులకు పంప్ మేనేజర్ నర్సయ్య.. పెట్రోల్ పంప్ నిర్వహణ, పెట్రోల్ నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ సుంకం హరీశ్, హెచ్ఎం అశోక్, గైడ్ టీచర్ ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

దవాఖానలోని సమస్యలు పరిష్కరించాలి

- **ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి**

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు27: పట్టణంలోని ఆర్మూర్ ఏరియా దవాఖానలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. దవాఖానను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంద పడకల దవాఖాన ఉన్నా అందులో పది పడకలకు సరిపడా వైద్య సిబ్బంది లేరన్నారు. డాక్టర్లు లేరని, బెడ్లు లేవని, ఎక్స్-రే, సిటీ స్కాన్ మిషన్లు లేవని అన్నారు. దవాఖానలో నెలకొన్న సమస్యలపై మొదటి అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకూ స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలీంకో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక నిర్ధారణ శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'హిందువులకు రోగం పుట్టిందా..'

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిములు రోజుకు ఐదు సార్లు నమాజ్ చేస్తారని, క్రిస్టియన్లు ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తారని, కానీ హిందువులు దేవాలయాలకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఏడాదికి ఒకసారి ఆలయానికి వెళ్లి కొబ్బరి కొట్టి వంద కోరికలు కోరుకుంటున్నారని అన్నారు. అసలు హిందువులకు రోగం పుట్టిందా అంటూ అసహనం వ్యక్తంచేశారు.

అదనపు కట్నం కేసులో రెండున్నరేళ్ల జైలుశిక్ష

బోధన్, ఆగస్టు 27: అదనపు కట్నం కోసం భార్యను వేధించి, ఇంటి నుంచి వెళ్లగొట్టిన కేసులో నిందితుడికి రెండున్నర ఏండ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం బోధన్‌లోని అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేసు పూర్వపరాలు ఇలా ఉన్నాయి. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఎడపల్లి మండలం టానా కాలన్‌కు చెందిన ఎర్రోళ్ల లావణ్య మల్కాపూర్‌కు చెందిన ఎర్రోళ్ల రవితో 2015లో వివాహం అయ్యింది. ఐదు నెలలపాటు ఆమెను బాగానే చూసుకున్న భర్త రవి.. ఆ తర్వాత తన కుటుంబసభ్యులతో కలిసి అదనపు కట్నం కోసం తన భార్యను వేధించారు. వివాహం సమయంలో పుట్టింటివారికి కల్యాణలక్ష్మి కింద ప్రభుత్వం ఇచ్చిన డబ్బుల నుంచి రూ.50 వేలు తీసుకురమ్మని వేధించడం ప్రారంభించాడు. పెద్దల సమక్షంలో రెండుసార్లు పంచాయితీ నిర్వహించారు. భర్త తనను వేధిస్తున్నాడంటూ లావణ్య 2016 డిసెంబర్‌లో ఎడపల్లి పోలీసులకు తన భర్త, అత్త, మామలపై ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్‌ను దాఖలుచేశారు. ఎర్రోళ్ల రవిపై నేరం రుజువుకావడంతో ఆయనకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి సాయిశివ తీర్పు ఇచ్చారు. అత్త, మామ, మరో కుటుంబ సభ్యులపై నేరం రుజువుకాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీహెచ్ రాణి కేసును వాదించారు.

మొక్కలు నాటిన కాలనీవాసులు

వినాయక్‌నగర్, ఆగస్టు 27 : నగరంలోని దారుగల్లీలో కాలనీవాసులు స్వచ్ఛందంగా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఎఫ్ఆర్వో సంజయ్ గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ వెంకటనారాయణ, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు హాజరై మొక్కలు నాటారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై సంబురాలు

సిరికొండలో సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేయడంతో జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు తినిపించుకొని సంతోషం వ్యక్తం చేశారు.

- నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 27

బోధన్‌లో కవిత మాస్కులతో మహిళల సంబురాలు

నవీపేట్ మండల కేంద్రంలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

బోధన్ మండలం భవానీపేట్‌లో ..

కడిగిన ముత్యం ఎమ్మెల్సీ కవిత

- **భారత జాగృతి నాయకుడు అవంతిరావు**

ఖిల్లీవాడి, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యమని, ధర్మమే గెలిచిందని భారత జాగృతి నాయకుడు అవంతిరావు అన్నారు. సుప్రీం కోర్టు కవితకు బెయిల్ మంజూరు చేయడంపై జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లిక్కర్ కేసులో ఆధారాలు లేకుండా ఐదు నెలలు కావాలనే కేసీఆర్‌పై కోపంతో కవితను జైల్లో పెట్టారని అన్నారు.

ధర్మమే గెలిచింది..

ధర్మమే గెలిచింది. ఎమ్మెల్సీ కవిత జైలు నుంచి విడుదలైంది. కడిగిన ముత్యంలా బయటికి వచ్చింది. లిక్కర్ స్కామ్‌లో సంబంధం లేకున్నా కావాలనే ఇరిగించారు. బీజేపీ పతనం మొదలు కానున్నది.

- అవంతిరావు, భారత జాగృతి నాయకుడు

కావాలనే కేసులో ఇరికించారు..

ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా బయటికి వచ్చింది. కవిత అంటే చాలా మందికి గౌరవం ఉన్నది. ఎన్నికల ముందు బీజేపీ వాళ్లు హైడ్రామా ఆడి ఎంపీ సీటు గెలుచుకున్నారు. లిక్కర్ కేసులో కావాలనే ఇరిగించారు.

- చింత మహేశ్, ఉద్యమకారుడు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదలైన అనంతరం ఆమెను కలిసి పరామర్శిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్, అర్బన్ మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

- **రూ. 6.82 లక్షల రికవరీకి ఆదేశం**

రుద్రూర్, ఆగస్టు 27 : మండలంలో ఉపాధిహామీ ప్రజావేదికను ఆడిట్ బృందం ఈనెల 13న నిర్వహించగా.. నిధుల అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. అవినీతికి పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాలని మంగళవారం ఆదేశించారు. అక్బర్‌నగర్ రూ.1,06,407, సులేమాన్‌నగర్ రూ.2,50,317, అంబం రూ.2,274, బొప్పాపూర్ రూ.2,600, రాయకూర్ రూ.3,216 , రాణంపల్లి రూ. 3,15,794 మొత్తం రూ. 6,82,124 నిధులు దుర్వినియోగం అయినట్లు వెల్లడించారు. అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు, సెక్రటరీలు, మేట్లను గుర్తించి, రూ. 70,152 జరిమానా వేశామని తెలిపారు. రాణంపల్లిలో అత్యధికంగా అవకతవకలకు పాల్పడిన మేట్‌ను విధుల నుంచి తొలగిస్తూ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో సురేశ్‌బాబు వెల్లడించారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శివప్రసాద్

ఖిల్లీవాడి, ఆగస్టు 27 : నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శివప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న నాగమోహన్ బాధ్యతలను అప్పజెప్పారు.

బీఎడ్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, ఆగస్టు 27 : టీయూ పరిధిలో బీఎడ్ రెగ్యులర్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫీజును వచ్చేనెల 4వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో వచ్చేనెల 5వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

కంఠేశ్వర్, ఆగస్టు 27 : నిరుద్యోగులకు ప్రైవేటురంగంలో ఉద్యోగావకాశం కల్పించేందుకు ఈనెల 29న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10.30 నుంచి శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423,77022 59070 నంబర్లకు ఫోన్‌చేయాలని సూచించారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి, ఆగస్టు 27 : మండలంలోని సుద్దపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ నళిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ సీట్లను భర్తీ కోసం ఈనెల 29న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపీసీలో ఎస్సీ-2, బైపీసీలో ఎస్సీ-1, బీసీ-1 ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

చలో ఢిల్లీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి/ సిరికొండ, ఆగస్టు 27 : కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్ హాస్టళ్లలో నాన్ టీచింగ్, వర్కర్లకు బేసిక్‌పే అమలు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 30న చలో ఎస్‌పీడీ (హైదరాబాద్) నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. డిచ్‌పల్లి కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్ వద్ద వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. సిరికొండలోని ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్‌లో ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాన్ టీచింగ్ వర్కర్లు పోస్టర్లను ఆవిష్కరించారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కంఠేశ్వర్, ఆగస్టు 27 : సంక్షేమ హాస్టళ్లల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విష్ణేశ్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లలో ఈ నెల 23 నుంచి 26వ వరకు సర్వే చేపట్టామని, హాస్టళ్లలో తాగునీటి సమస్య ఉన్నదని, పాఠ్యపుస్తకాలు అందలేవని తెలిపారు. కాస్మొటిక్ చార్జీలను పెంచడం, స్కాలర్‌షిప్‌ను అందజేయడం తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మోర్తాడ్/ భీమ్‌గల్/ఏర్గట్ల/ముప్కాల్/నందిపేట్/ ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 27 : రానున్న పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. భీమ్‌గల్‌లో సీఐ నవీన్, ఎస్సై మహేశ్ మండల ప్రజలతో సమావేశమై మాట్లాడారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్లలో గణేశ్ మండళ్ల నిర్వాహకులతో మోర్తాడ్ ఎస్సై విక్రమ్ సమావేశం నిర్వహించారు. ఏర్గట్లలో మండలంలోని అన్ని గ్రామాల వీడీసీ, గణేశ్ మండళ్ల సభ్యులతో ఎస్సై రాము సమావేశం నిర్వహించారు. ముప్కాల్ మండలంలోని గ్రామాల యువకులతో ఎస్సై రజినీకాంత్ సమావేశం నిర్వహించారు. నందిపేట్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఎస్సై హరిబాబు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ట్రాన్స్‌కో ఏడీ అశోక్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోదాముల ప్రారంభం

గోదామును ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ/ ధర్పల్లి, ఆగస్టు 27 : సిరికొండ మండలంలోని కొండూర్, పెద్దవాల్గోట్‌లో నూతనంగా నిర్మించిన గోదాములను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. కొండూర్‌లో రూ.21 లక్షలతో, పెద్దవాల్గోట్ రూ.23 లక్షలతో 250 మెట్రిక్ టన్నుల గోదాములను నిర్మించినట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. సిరికొండలో సర్వే నంబర్ 532, గడ్కోల్‌లో సర్వేనంబర్ 100లో ఉండే లబ్ధిదారులు అటవీ శాఖ అధికారులు తమపై అక్రమ కేసులు పెడుతున్నారని రూరల్ ఎమ్మెల్యేకు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తమకు పట్టాలు అందజేసిందని, జాయింట్ సర్వేలో రెవెన్యూ భూమి అని తేలిందని, హైకోర్టు లబ్ధిదారులకు చెందుతుందని తీర్పు చెప్పినప్పటికీ తమను సాగు చేసుకోకుండా అడ్డుకుంటూ, కేసులు పెడుతున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ధర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 110 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణీ చేశారు. అంతకుముందు పలు అభివృద్ధి పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు.

మెస్ మేనేజర్ గెస్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిల్లీవాడి, ఆగస్టు 27 : నాగారంలోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ పద్ధతితో మెస్ మేనేజర్‌గా పనిచేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ గంగారాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ (ఫుడ్ అండ్ న్యూట్రిషన్ లేదా తత్సమాన కోర్సు) పూర్తిచేసిన వారు ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ప్రైవేట్‌కు దీటుగా వైద్యం అందించాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు27: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ దవాఖానలో నాణ్యమైన వైద్యం అందించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ దవాఖానను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దవాఖానలో నెలకొన్న సమస్యలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

శ్యామ్‌కుమార్‌కు డాక్టరేట్

డిచ్‌పల్లి, ఆగస్టు 27 : టీయూ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి గాజుల శ్యామ్‌కుమార్.. డాక్టర్ సత్యనారాయణరెడ్డి మావురపు పర్యవేక్షణలో 'డిజైన్ సింథసిస్ ఆఫ్ నావెల్ హెటిరోసైక్లిక్ సమ్మేళనాలు యాంటీ క్యాన్సర్ ఏజెంట్లు, వాటి మాలిక్యూలర్ డాకింగ్' అంశంపై పరిశోధన చేశారు. టీయూలో మంగళవారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఓయూ -హైదరాబాద్ ఆచార్య ఎ.కృష్ణంరాజు హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై ప్రశ్నలు అడిగారు. పరిశోధక విద్యార్థి ఉదాహరణతో సమాధానాలు ఇవ్వడంతో డాక్టరేట్ పట్టాకు ఆమోదం తెలిపారు.

ఓటరు జాబితా సవరణ

కోటగిరి/రుద్రూర్/మోస్రా (చందూర్)/ఎడపల్లి, ఆగస్టు 27 : పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితా సవరణ చేపడుతున్నారు. అధికారులు పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. కోటగిరిలో ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు సవరణ చేసి, ఈనెల 29న ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. రుద్రూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితా మర్జ్ చేపడుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీవో సునీత తెలిపారు. రుద్రూర్‌లో తహసీల్దార్ వెంకటేశం, మోస్రాలో ప్రత్యేకాధికారి సాయిలు బీఎల్‌వోలతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ వార్డుల వారీగా తయారు చేస్తున్నామని ఎడపల్లి ఎంపీవో మనోహర్ శర్మ అన్నారు. ఎడపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సవరించిన జాబితాను మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ 6న ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

రుద్రూర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జా

- **తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు**

రుద్రూర్, ఆగస్టు 27 : మండలకేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి రేకులషెడ్లు వేసుకుంటున్నారని స్థానికులు తహసీల్దార్ వెంకటేశానికి మంగళవారం ఫిర్యాదుచేశారు. మండలకేంద్రానికి చెందిన కొట్టాల నవీన్ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రేకులషెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు పోటీ పడుతూ ఘర్షణ పడుతున్నారని, అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు



బోధన్‌లోని ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహిస్తున్న సంబురాలు

బోధన్/రెంజల్/ఏర్గట్ల/బాల్కొండ/ సుభాష్‌నగర్/ కోటగిరి/ పొతంగల్/ మోస్రా (చందూర్), ఆగస్టు 27 : జిల్లాకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న గీతాభవనంలో కృష్ణాష్టమి వేడుకలను గీతాభవనం అధ్యక్షుడు ఎంఎస్ నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. బోధన్ రాకాసీపేట్‌లోని ఇందూర్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. లయన్స్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పోలవరపు బసవేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ వేడుకలను ప్రారంభించారు. రెంజల్ మండలంలోని దూపల్లిలో యాదవసంఘం ఆధ్వర్యంలో కృష్ణుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఉట్టి కొట్టి అన్నదానం చేశారు. కందకుర్తిలో కేశవ శిశు మందిర్ పాఠశాలలో, ఏర్గట్లలో స్థానిక వీడీసీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శక్తి సేన ముదిరాజ్ యూత్ సభ్యులు ఉట్టి కొట్టి ఊరేగింపు నిర్వహించారు. బాల్కొండలో కృష్ణుడి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారుల వేషధారణ ఆకట్టుకున్నది. వల్లభాపూర్‌లో నిర్వహించిన శోభాయాత్రకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పొతంగల్ మండలం హంగర్గా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మోస్రా రామాలయంలో శ్రీ వైష్ణవ సాంప్రదాయ శ్రీకృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలుచేశారు.

బంగారు గొలుసు చోరీ

బాల్కొండ, ఆగస్టు 27: మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన దుర్గం వనజకు చెందిన రెండు తులాల బంగారు పుస్తెలతాడును ఆమె మెడలో నుంచి దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. వనజ ఉదయం తన పిల్లలను మదర్‌థెరిస్సా స్కూల్‌లో వదిలేసి తిరిగి వెళ్తోంది. పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును ఎత్తుకుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక రోజు జైలు శిక్ష -** రుద్రూర్, ఆగస్టు 27 : రుద్రూర్‌లో ఈనెల 20న నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఒకరు మద్యం తాగి పట్టుబడ్డారు. బోధన్ కోర్టులో మంగళవారం హాజరుపర్చగా.. ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పు చెప్పారని రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు.
- **మోస్రాలో 'రైతునేస్తం' -** మోస్రా (చందూర్), ఆగస్టు 27 :మోస్రాలోని రైతువేదికలో ఏఈవో దస్తగిరి ఆధ్వర్యంలో మగళవారం 'రైతు నేస్తం' నిర్వహించారు. శాస్త్రవేత్తలు పంటల సంరక్షణపై సూచించిన సలహాలను టీవీల్లో వీక్షించారు.
- **సీజనల్ వ్యాధులపై అవగాహన -** మోపాల్ (ఖిల్లీవాడి), ఆగస్టు 27 : మోపాల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అశోక్‌ఫారంలో, మోపాల్ కేజీబీవీ